గంగమ్మ ఒడి నుంచి.. విశాఖ తీరానికి..

తరలివచ్చిన పార్వతీపుత్రుడు • కొలువుదీరనున్న 'కోల్‌కతా' గణనాథులు











గంగమ్మ ఒడిలో రూపుదిద్దుకున్న గణనాథుని విగ్రహాలు విశాఖ తీరానికి చేరాయి. ప్రకృతి హితంగా మట్టి వినాయకులనే పూజించాలన్న ప్రజల అభీష్టానికి అనుగుణంగా వీటిని విశాఖవాసులకు అందుబాటులోకి తెచ్చారు వ్యాపారులు. కోల్‌కతాలోని గంగానది మట్టితో తయారు చేసిన చిన్న చిన్న ప్రతిమల నుంచి భారీ విగ్రహాల వరకు అల్లిపురంలో విక్రయాలకు సిద్ధంగా ఉంచారు. రూ.50 నుంచి రూ.17వేల వరకు వివిధ సైజుల్లో రకరకాల డిజైన్లలో రంగు రంగుల వినాయక ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. ధర కాస్త ఎక్కువైనా ఏటా ఇక్కడే విగ్రహాలు కొంటుంటామని ప్రకృతి ప్రేమికులు తెలిపారు. స్వచ్ఛమైన మట్టితో చేయడంతో అలంకరణ బాగుంటుందని, పిల్లలు కూడా వీటినే ఇష్టపడుతున్నారని కొందరు వినియోగదారులు తెలియజేశారు. ప్రజల అభిరుచికి అనుగుణంగా తయారు చేయించి, కోల్‌కతా నుంచి కంటైనర్‌లో వీటిని తీసుకువచ్చి విక్రయిస్తున్నామని వ్యాపారి బొట్టా రమేష్ తెలిపారు. రవాణా సమయంలో కొంత నష్టం ఉన్నా, పర్యావరణహితం కావడంతో ఏటా వీటిని తీసుకువచ్చి విక్రయిస్తామని చెప్పారు. రెండు దశాబ్దాలుగా ఈ వ్యాపారమే చేస్తున్నామన్నారు. – అల్లిపురం

క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం ఈవో రమాబాయి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకుడు శ్రీనివాస్ గణపతి పూజ, అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన మహిళలు, యువతులు ఎరుకుమాంబకు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

మట్టి గణపతినే పూజించండి



మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న మార్వాడీ సమ్మేళన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: పర్యావరణ హితమైన మట్టి వినాయక ప్రతిమలనే పూజకు వినియోగించాలని ఆంధ్రప్రదేశ్ ప్రాదేశిక్ మార్వాడీ సమ్మేళన్ ఉపాధ్యక్షుడు పోదేశ్వర్ పురోహిత్ పిలుపునిచ్చారు. జగదాంబ జంక్షన్ సమీపాన గల సంస్థ కార్యాలయం వద్ద బుధవారం పలువురు ప్రముఖుల చేతుల మీదుగా మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. భక్తులందరూ మట్టి విగ్రహాలను వినియోగించి, ఇంటి పెరట్లో నిమజ్జనం చేస్తే నీరు కలుషితం కాదని, మట్టిలో కరిగిపోతుందన్నారు. కార్యక్రమంలో సమ్మేళన్ కోశాధికారి రాజేష్ బన్సాల్, రైతు మిత్ర దాట్ల, సీనియర్ పాత్రికేయుడు ఎంఎస్ఆర్‌ఎల్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలకు పందిరి రాట



పందిరి రాట కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, మహిళలు

అల్లిపురం: నేరెళ్లకోనేరు జంక్షన్‌లో రైజింగ్ గైస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. బుధవారం చవితి పందిరి రాట వేశారు. మహిళలు ఉడుపు రాటకు మామిడి తోరణాలు, పసుపు కుంకుమలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ నెల 11న అన్నదానం, 16న వినాయక నిమజ్జనం కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గోపాలపట్నం: సింహాచలం రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫారం శివారులో గుర్తు తెలియని ఒక వ్యక్తి మృతి చెందాడు. జీఆర్‌పీ ఎస్‌ఐ రవివర్మ తెలిపిన వివరాలిలా.. వేగంగా వెళ్తున్న రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు జారి పడటంతో గాయాలపాలై మృతి చెందినట్టుగా గుర్తించారు. రైలు నుంచి పడటంతో తలకు బలమైన గాయాలు, శరీరంలో రగుడు గాయాల కావడంతో మరణించి ఉంటాడని భావిస్తున్నారు. ఈ వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఎవరైనా గుర్తిస్తే 99895 70010 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ రవి వర్మ కోరారు.

'ఆస్తి పన్ను తగ్గింపు' అజెండాలో పెట్టండి



మేయర్ హరివెంకటకుమారికి వినతిపత్రం అందజేస్తున్న గంగారావు

దాబాగార్డెన్స్: ఆస్తి పన్ను తగ్గింపు, ఆస్తి విలువ ఆధారిత పన్ను రద్దు, చెత్తపై యూజర్ చార్జీల రద్దు విషయమై జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో అజెండాగా పెట్టాలని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, సీపీఎం నగర కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ కోరారు. ఈమేరకు బుధవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 10న నిర్వహించే సమావేశంలో ప్రస్తుత నివాస భవనాల ఆస్తి పన్ను పరిధి 0.13 శాతం నుంచి 0.10 శాతానికి, నివాసేతర భవనాలకు 0.30 శాతం నుంచి 0.20 శాతానికి తగ్గింపుకు తీర్మానం చేయాలని కోరారు. చెత్తపై యూజర్ చార్జీలు పూర్తిగా రద్దు విషయమై కూడా తీర్మానించాలన్నారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆస్తి పన్ను తగ్గిస్తామని, సమీక్షిస్తామని, చెత్తపై యూజర్ చార్జీలు పూర్తిగా రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. ఈ ప్రతిపాదనలకు జీవీఎంసీ కౌన్సిల్‌లో ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ కార్పొరేటర్లు మద్దతిస్తారని భావిస్తున్నామని, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కూడా సీపీఎం ప్రతిపాదనలు బలపరుస్తారని ఆశిస్తున్నట్టు వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఆటో కార్మికుల సమస్యలపై పురందేశ్వరికి వినతి



పురందేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

దాబాగార్డెన్స్: ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, పార్లమెంట్ సభ్యురాలు పురందేశ్వరికి విశాఖ ఆటో స్టాండ్ అసోసియేషన్ బుధవారం వినతిపత్రం అందజేసింది. ఓలా, ఉబర్, రాపిడో వంటి ఆన్‌లైన్ కంపెనీల వల్ల ఆటో కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఎయిర్‌పోర్టులో పికప్ అండ్ డ్రాప్ 10 నెలల ముందువరకు ఉండేదని, ప్రస్తుతం ఎయిర్‌పోర్టులోకి ఆటోలు వెళ్లేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ అనుమతి లేకుండా చేయడంతో కష్టమవుతోందని ఆటో కార్మికులు తెలియజేశారు. ఎంపీకి వినతిపత్రం అందించిన వారిలో అసోసియేషన్ నాయకులు జి.శ్రీధర్, సురేష్‌కుమార్, పి.నాయుడు, ఎస్.లక్ష్మణరెడ్డి, పి.సంతోష్, అప్పలరాజు తదితరులున్నారు.

కోల్‌కతా ఘటనపై కొవ్వొత్తుల ప్రదర్శన



కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు, పరిశోధకులు

మహారాణిపేట: కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా బుధవారం ఆంధ్రా యూనివర్సిటీ విద్యా విభాగంలో ఆచార్య టి.షారోన్‌రాజు ఆధ్వర్యంలో ఆచార్యులు, విద్యార్థులు, పరిశోధకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా షారోన్‌రాజ్ మాట్లాడుతూ ఇటువంటి అతి హేయమైన, భయానకమైన ఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ ఘాతుకానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాశ్, డాక్టర్ రాము, డాక్టర్ ప్రణీత్, డాక్టర్ సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం



నిందితుడు, స్వాధీనం చేసుకున్న గంజాయితో రైల్వే పోలీసులు

తాటిచెట్లపాలెం: అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని, 13.7 కేజీల సరకును స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఉన్నతాధికారుల ఆదేశాలతో విశాఖ రైల్వే స్టేషన్‌లో సిబ్బంది బుధవారం తనిఖీలు నిర్వహించారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్‌ఐ జూలి కర్మాకర్ తనిఖీల్లో కేరళకు చెందిన వివేక్ వద్ద గంజాయిని గుర్తించారు. అతను 13.7 కిలోల గంజాయిని విశాఖ రైల్వేస్టేషన్ మీదుగా చెన్నైకు తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జీఆర్పీ ఎస్‌ఐ వి.రవివర్మకు అప్పగించారు. అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

ధరలు తగ్గించాలని ఆందోళన



రైల్వే స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ నాయకులు

తాటిచెట్లపాలెం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా పెంచిన పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ నేత జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా సీపీఐ చేపడుతున్న ప్రజా ఆందోళనలో భాగంగా బుధవారం విశాఖ రైల్వేస్టేషన్ ఇన్‌గేట్ ఎదురుగా శ్రీ విజయదుర్గ ఆటో ఓనర్స్ కమ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వామనమూర్తి మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ధరలు తగ్గిస్తామని, ఏడాదికి రెండు కోట్ల మందికి ఉద్యోగాలు ఇప్పిస్తామని, విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని వెలికి తీసి ప్రతీ పేద కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి పదేళ్లు దాటినా.. ఈ హామీలను నెరవేర్చలేకపోయారని విమర్శించారు. డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంబానీ, అదానీలకు లక్షల కోట్ల రూపాయల రాయితీలు కల్పిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం దేశవ్యాప్త ఆందోళన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాజేష్, నాగరాజు, ఆంజనేయులు, వై.వెంకట్, రావికృష్ణ, హెచ్.శేఖర్, జై గణేష్ కుమార్, శ్రీను, అప్పలరాజు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యల్లో జీవీఎంసీ బృందం



సహాయక చర్యల్లో పాల్గొన్న జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

దాబాగార్డెన్స్: జీవీఎంసీ బృందం వరద సహాయక చర్యల్లో పాల్గొంది. కమిషనర్ సంపత్‌కుమార్‌తో పాటు పలువురు అధికారులు, పారిశుధ్య కార్మికులు మంగళవారం రాత్రి విశాఖ నుంచి విజయవాడకు చేరుకున్నారు. జీవీఎంసీ బృందం బుధవారం వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులకు సేవలందించిందని కమిషనర్ సంపత్‌కుమార్ విజయవాడ నుంచి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ 64వ వార్డులోని కండ్రిగ ప్రదేశంలో వరదల్లో చిక్కుకున్న ప్రజలకు ఆహారం పొట్లాలు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని తానే స్వయంగా నిర్వహిస్తూ పర్యవేక్షించినట్లు తెలిపారు. తనతో పాటు చైల్డ్ వెల్ఫేర్ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి వరద ముంపు ప్రాంతాల్లో ఆహార పొట్లాలు అందజేశారన్నారు.

నీటి నిల్వలతో దోమల వృద్ధి



దొండపర్తిలో నీటి నిల్వలు పరిశీలిస్తున్న సిబ్బంది

సీతమ్మధార: ఎక్కువ రోజులు నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని జీవీఎంసీ జోన్‌-3 మలేరియా విభాగం తాత్కాలిక సిబ్బంది అన్నారు. 27వ వార్డు దొండపర్తి పరిసర ప్రాంతాల్లో బుధవారం ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్రైడే–డ్రైడే నినాదంతో ప్రజలంతా విధిగా ప్రతి శుక్రవారం లేదా వారంలో ఒక రోజు నీరు నిల్వ చేసే పాత్రలను ఖాళీ చేసి ఎండలో ఆరబెట్టాలని సూచించారు. ఈ కారణంగా దోమ లార్వాలు నాశనమవుతాయన్నారు. బాల్కనీ, ఇంటి డాబాల మీద, కొబ్బరిబొండాలు, పనికిరాని టైర్లు ఇతర సామగ్రిలోను వర్షపు నీటి కారణంగా దోమలు వృద్ధి చెందుతాయన్నారు. వాటర్ ట్యాంకులను తరచూ శుభ్రం చేసుకోవాలన్నారు. భవనాల మీద ఉన్న వాటర్ ట్యాంకుల్లో దోమల నివారణ మందు కలిపారు. అరగంట వరకు ట్యాంక్ నీటిని వాడరాదని స్థానికులకు వారు సూచించారు. వార్డులోని రామాలయం వీధి, కుమ్మరి వీధి, నెహ్రూ బజార్, ఎస్సీ కాలనీ, చుక్కావారి వీధి తదితర ప్రాంతాల్లో నీటి నిల్వలను పరిశీలించి, నివాసులకు సూచనలు, సలహాలిచ్చారు.

నేత్రదానంపై అపోహలు వద్దు

సీతంపేట: నల్ల గుడ్డు అంధత్వం బారినపడి అనేక మంది చూపు కోల్పోతున్నారని, ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసేందుకు ముందుకు రావాలని ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆప్తాల్మజీ హెడ్ డాక్టర్ ప్రభాకర శాస్త్రి పిలుపునిచ్చారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.మీనాక్షి ఆధ్వర్యంలో ఆస్పత్రిలో రోగులకు, వారి బంధువులకు నేత్రదానం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిర్మయి మాట్లాడుతూ నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగిపోయేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎంవో డాక్టర్ నవీన్‌కుమార్, హెడ్ నర్స్ రాజేశ్వరి, పీఎంవోలు ఉమా శ్రీనివాస్, సురేష్, కౌన్సిలర్లు పూర్ణిమ, సుజాత, పీజీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, అధికారులు, సిబ్బంది

విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం బాలల ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ ప్రారంభించారు. అనంతరం ఆయన రక్తదానం చేసి దాని ఆవశ్యకతను వివరించారు. ఒకరు రక్తదానం చేయడం వల్ల ముగ్గురు ప్రాణాలను కాపాడిన వారవుతారని తెలిపారు. రక్తదాత ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ కార్యదర్శి దాట్ల కీర్తి, ఎస్టేట్ అధికారి లక్ష్మారెడ్డి, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, ఎస్ఈ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ రామరాజు, రేంజ్ ఆఫీసర్లు శ్యామల, శివానీ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



పోలయ్య మృతదేహానికి అంతిమ సంస్కారాలు చేస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం: అనాథ వ్యక్తి మృతదేహానికి 33వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిరపల్లి రాము అంత్యక్రియలు నిర్వహించి అందరి మన్ననలు పొందారు. 33వ వార్డులో అనాథగా ఉంటున్న కిలిమి పోలయ్యను గత నెల 29న ఏయూటీడీ భీమనగర్ నిరాశ్రయుల వసతి గృహంలో చేర్పించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న అతడు బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పచ్చిరిపల్లి రాము అక్కడికి చేరుకుని కిలిమి పోలయ్య మృతదేహాన్ని చావులమదుం శ్మశాన వాటికకు తీసుకువెళ్లారు. పి.వి.ఎస్.రెడ్డి, రామలింగంలతో కలిసి ఆయన అనాథ శవానికి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సీతంపేట: బుల్లయ్య కళాశాలలో జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం జాతీయ పోషకాహార వారోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులు నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య రామకృష్ణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవాలని, జంక్ ఫుడ్ జోలికి పోవద్దని సూచించారు. ఈ సందర్భంగా బీఎంఐ డైట్ ప్లాన్, కల్తీ ఫుడ్, నేచురల్ ప్రిజర్వేటివ్స్, ఈస్ట్ కిణ్వ ప్రక్రియ, మైక్రో గ్రీన్స్, ప్రో బయోటిక్స్, తదితర అంశాలపై విద్యార్థులు ప్రదర్శించిన డెమోలు, చార్టులు ఆకట్టుకున్నాయి.

ఏయూ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు

సీతమ్మధార: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థుల హాస్టళ్లలో అధికారులు ఆకస్మికంగా తనిఖీలు చేశారు. బుధవారం రాత్రి 9.30 నుంచి సుమారు రెండు గంటల పాటు ఈ ప్రక్రియ కొనసాగింది. ముందుగా ఇంజినీరింగ్ కళాశాల బాలుర వసతి గృహం హాస్టళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. హాస్టళ్లలో విద్యార్థులతోపాటు బయట వ్యక్తులు ఎవరైనా ఉంటున్నారా, విద్యార్థులు ఏ విధంగా ఉంటున్నారు అనే వాటిని ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల, సైన్స్ కళాశాల హాస్టళ్లను సైతం తనిఖీ చేశారు. విశ్వవిద్యాలయాల్లో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు, గంజాయి వంటి వాటికి స్థానం ఇవ్వరాదని ఏయూ అధికారులు నిర్ణయించారు. ఏయూను ర్యాగింగ్ రహితంగా తీర్చిదిద్దాలని పనిచేస్తున్నారు. దీని కోసం పటిష్ట ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. దీనిలో భాగంగా అధికారులు బుధవారం రాత్రి హాస్టళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల ప్రక్రియలో రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్ బాబు, హాస్టల్స్ చీఫ్ గార్డెన్స్ హరినాథ్, రమేష్‌బాబు, చిట్టిబాబు, ఏయూ సెక్యూరిటీ విభాగం డీన్ ఆచార్య పి.అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.